# శ్రీ కొప్పుల హరీశ్వర్ రెడ్డి

శ్రీ హరీశ్వర్ రెడ్డి పదకొండవ శాసనసభ (1999-2003) డెప్యూటీ స్పీకర్‌గా 2001, డిసెంబరు 31న ఏకగ్రీవంగా ఎన్నికై 2003, నవంబరు 14 వరకు ఆ పదవిని నిర్వహించారు.

వీరు రంగారెడ్డి జిల్లా పరిగి గ్రామంలో 1947, మార్చి 18న జన్మించారు. హెచ్.ఎస్.సి. విద్యను పూర్తి చేసినారు.

శ్రీ హరీశ్వర్ రెడ్డి 1975వ సంవత్సరం నుండి 1980వ సంవత్సరం వరకు పరిగి గ్రామ సర్పంచ్‌గా ఉన్నారు. 1980-1985 సంవత్సరాల మధ్య కాలంలో పరిగి సమితి ఉపాధ్యక్షులుగా ఉన్నారు. 1985వ సంవత్సరములో జరిగిన ఎన్నికలలో మొదటిసారిగా రంగారెడ్డి జిల్లా పరిగి నియోజకవర్గం నుండి రాష్ట్ర శాసనసభకు ఎన్నికైనారు. వీరు 1986-1988 సంవత్సరాలలో ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పోరేషన్ డైరెక్టర్‌గా ఉన్నారు. 1988-1989 సంవత్సరాలలో తిరుమల తిరుపతి దేవస్థానాల బోర్డు మెంబరుగా ఉన్నారు. వీరు 1989-1990 సంవత్సరాలలో శాసనసభ అనుగత చట్ట నిర్మాణ కమిటి అధ్యక్షులుగా పనిచేసారు.

శ్రీ హరీశ్వర్ రెడ్డి 1994, 1999, 2004 సంవత్సరములలో వరుసగా పరిగి నియోజకవర్గం నుండి శాసనసభ్యుడిగా ఎన్నికైనారు. వీరు 1997 వ సంవత్సరం నుండి 2000 సంవత్సరం వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ అధ్యక్షులుగా పనిచేసారు. వీరు 1997-1999 సంవత్సరములలో సెక్రటేరియట్, హైకోర్టు భవనములకు రోడ్లు, భవనముల శాఖ చేపట్టిన పనులలో జరిగిన అవకతవకలకు సంబంధించి ఏర్పాటు చేసిన శాసనసభా కమిటి అధ్యక్షులుగా వ్యవహరించారు.

వీరు శాసనసభ ప్యానెల్ ఛైర్మన్‌గా, వివిధ కమిటీలలో సభ్యునిగా ఉన్నారు. వీరు 2002-2003 సంవత్సరములలో డెప్యూటీ స్పీకర్ హోదాలో అర్జీల, విశేషాధికారాల కమిటీల అధ్యక్షులుగా ఉన్నారు.

## శ్రీ హరీశ్వర్ రెడ్డి డెప్యూటీ స్పీకర్‌గా ఎన్నికైన సందర్భంగా చేసిన ప్రసంగం

పదకొండవ శాసనసభకు నన్ను డెప్యూటీ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నందుకు గౌరవ ముఖ్యమంత్రి గారికి, గౌరవ ప్రతిపక్ష నాయకులు రాజశేఖర్ రెడ్డి గారికి, ఇంద్రసేనారెడ్డి గారికి, పెద్దలందరికీ, ప్రతి ఒక్క శాసనసభ్యుడికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియచేసు కుంటున్నాను. మీరు చెప్పిన విషయాలన్నింటిని దృష్టిలో పెట్టుకొని, పార్టీలకతీతంగా ఈ సభను నిర్వహించడానికి మీ అందరి సహకారం తీసుకొంటాను. ఈ రోజున మీరు నా మీద చూపినటువంటి ఆదరాభిమానాల్ని నేను ఎప్పుడూ మరచిపోను. ఈ సభ యొక్క హుందాతనాన్ని నిలబెట్టడంలో మీరు ఇచ్చిన సూచనల్ని తు.చ. తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటాను. మీ అందరి సహకారంతో తప్పకుండా ఈ సభను హుందాతనంగా నిర్వర్తించగలనని చెపుతూ, మరొక్కసారి మనస్ఫూర్తిగా మీ అందరికీ కృతజ్ఞతలు తెలియ చేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.